- నిధుల లేమితో పరిష్కారం కాని సమస్యలు
- అప్పులు తెచ్చి నెట్టుకొస్తున్న కార్యదర్శులు
- పాలకవర్గం లేకపోవడంతో నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి

పల్లెల్లో పాలన అస్తవ్యస్తం



చింతలమానేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెల్లో పాలన అస్త వ్యస్తంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో అభివృద్ధి మాట అటుంచితే సమస్యలే పరిష్కారం కావడం లేదు. గ్రామాల్లో పారిశుధ్యం అస్త వ్యస్తంగా తయారైంది. సర్పంచుల పదవీ కాలం 2023 ఫిబ్రవరితో ముగిసింది. అప్పటి నుంచి పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీంతో అభివృద్ధి పనులు, సమస్యల పరి ష్కారం బాధ్యత పంచాయతీ కార్యద ర్శులపై పడింది. ఏడాదిన్నర కాలంగా పంచాయతీ కార్యద ర్శులు అప్పులు తెచ్చి పరిపాలన సాగిస్తున్నా రు. గ్రామాల్లో వసూలు చేసిన పన్నుల నుంచి కొంత డబ్బు ఖర్చు చేసినా గ్రామాల్లో కుంటుపడ్డ అభివృద్ధి పనులకు అవి ఏ మాత్రం చాలడం లేదు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది. కానీ సెప్టెంబరు 30 లోపు ఎన్నికలు జరిగితేనే గ్రామాల్లో ప్రజాప్రతిని ధులు ఉంటారు. దీని ద్వారానే అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● ఎస్ఎఫ్‌సీ నుంచి..

రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సీ) నుంచి మాత్రం పంచాయతీ కార్మి కుల వేతనాలు విడుదల చేస్తుంది. జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీ వర్కర్ల వేతనాలను నెలనెలా ఇవ్వకు న్నా కొంత మేర ప్రతీ రెండు, మూడు నెలలకో సారి విడుదల చేస్తోంది. అది కూడా పంచాయతీ కార్మికులు తమకు నెల నెలా వేతనాలు అందజేయా లని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నాలు చేస్తే నిధులు విడుదల చేసినట్లు తెలు స్తోంది. కేంద్రం విడుదల చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పాలక వర్గం లేని కారణంగా విడుదల చేయడం లేదు. పాలక వర్గం బాధ్యతల చేపట్టితే తప్ప ఆ నిధులు వచ్చే పరిస్థితి లేదు. అ టు కేంద్ర నిధులు రాక, ఇటు రాష్ట్రం నిధులు విడుదల చేయక గ్రామ పంచాయతీల నిర్వహణ ప్రత్యేకాధికారులకు తలకు మించిన భారం అవుతుంది.

● స్థానిక ఎన్నికలపై ముందుకు..

రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల్లోనే గ్రామ పంచా యతీ ఎన్నికలు పూర్తి చేస్తుందని పలువురు రాజ కీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ పంచాయతీల ఓటర్ల జాబితాను ప్రచురించింది. సెప్టెంబరు 2న ఓటర్ల తుది జాబితా అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించేందుకు ఎన్ని కల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. వారం రోజుల్లోగా ఎన్నికల నోటిపికేషన్ జారీ అవుతుం దని, సెప్టెంబరు నెలాఖరులోగా ఎన్నికల పూర్తవు తాయని బావిస్తున్నారు. సుప్రీంకోర్టు ఇప్పటికే సెప్టెంబరు 30 వరకు ఎన్నికలకు గడువు ఇవ్వగా ప్రభుత్వం అందుకు అనుగుణంగానే సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదంతా అనుకున్నట్లు స వ్యంగా ఎన్నికలు పూర్తై ప్రజాప్రతినిధులు గ్రామా ల్లో ఉంటే కేం ద్రం నుంచి వచ్చే నిధులు, రాష్ట్ర నిధులతో గ్రామాలు అభివృద్ధి బాట పట్టనున్నాయి.

పాఠశాలను సందర్శించి.. పాఠాలు బోధించి..



విద్యార్థులకు గణితం బోధిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

పెంచికలపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి శనివారం సందర్శించి విద్యార్థులకు గణితం బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి పలు అంశాలను వివరించారు. అలాగే మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, భోజన శాల పరిసరాల పరిశుభ్రత, రిజిస్టర్లను పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు, ప్రహరి గోడ సదుపాయాలు కల్పించడంతో పాటు మధ్యాహ్న భోజనంలో పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు అందించే విద్యాబోధన, మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజన తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని చెప్పారు. వంట సమయంలో శుభ్రత పాటించాలని, విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆల్బర్ట్, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల గణిత బోధనపై పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తరగతి గదిలో బోర్డుపై విద్యార్థుల చేత గణితానికి సంబంధించిన ప్రశ్న రాసి సమాధాన్ని రాబట్టారు. విద్యార్థులు కష్ట పడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అదే విధంగా సెల్‌పోన్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటిస్తున్నారా అని ప్రశ్నించారు. ఆయన వెంట సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజేందర్, ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం సీజ్ చేసినట్లు సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. మహేష్, వెంకటేష్‌లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

వాంకిడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాంకిడి ఇన్‌చార్జి ఎంపీడీవోగా సుధాకర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పదవీ విరమణ పొందడంతో చింతలమానేపల్లి ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

ఓటరు జాబితాను సవరించాలి

రెబ్బెన, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాను వెంటనే సవరించాలని సీపీఐ మండల కార్యదర్శి రాయుల నర్సయ్య అన్నారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్తి స్థాయిలో పరిశీలించి తుది జాబితా ప్రచురించాలని కోరారు.

పోస్టర్ల విడుదల

వాంకిడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద సోమవారం నిర్వహించే ధర్నా పోస్టర్లను పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. కార్యక్రమంలో వినేష్, గిర్మాజీ, అమీరున్నీసా, విద్యాసాగర్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణే ధ్యేయం

బెజ్జూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత, నేరాల నియంత్రణే ధ్యేయంగా నిందితులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఎస్సై సర్తార్‌పాషా అన్నారు. పోలీసు స్టేషన్‌లో శనివారం స్థానిక వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.

గిరిజనులకు సంక్షేమ పథకాలు అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారికి సంక్షేమ పథకాలు అందించాలని ఆది కర్మయోగి అభియాన్ మండల నోడల్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రాల్లో ఎంపీడీవో కార్యాలయంలో ఆదికర్మ యోగి కార్యక్రమంపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మం డలంలో నాలుగు గ్రామ పంచయతీలు పథకానికి ఎంపిక య్యాయని అన్నారు. ఆయా గ్రామాల్లో అవసరమైన వసతులను ప్రజల నుంచి ముందుగా సేకరించాలన్నారు. వాటి కల్పన కోసం ఏడు రకాల వివిధ శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామ సభల ద్వారా అవసరమైన పనుల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం బ్లాక్ స్థాయి మాస్టర్ ట్రైనర్లు గ్రామ స్థాయి శిక్షకులకు శిక్షణ అందిం చారు. పథకంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షకులు సుభాష్, ఏటీడీఓ చిరంజీవి, ఉత్తం, శారద, గోవింద్‌చంద్‌సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

జైనూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ ఎంపీ నగేష్ అన్నారు. జైనూర్ మండల పరిధిలో గల పట్నాపూర్ సిద్దేశ్వర్ సంస్థాన్‌లో శనివారం నిర్వహించిన పూలాజీబాబా జన్మదిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. బాబా బోధనలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భక్తులు మద్య పానం నిషేధించి సన్మార్గంలో పయనిస్తున్నారని చెప్పారు. పులాజీబాబా ప్రబోధనలు దేశ విదేశాలలో ప్రసరించాయన్నారు. ఆదేవిధంగా సంస్థాన్ పవిత్ర స్థలంలో భక్తులకు సకల సదుపాయాలు కల్పించెందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పాట్నాపూర్ నుంచి దామాజీ వరకు రోడ్డు సదుపాయం కల్పించాలని సిద్దేశ్వర్ సంస్థాన్ కమిటీ సభ్యులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ పాట్నాపూర్ సిద్దేశ్వర్ సంస్థాన్ ప్రాంగణంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ కాంతిలాల్ సుభాష్ మాట్లాడుతూ పులాజీబాబా బోధనలతో మూఢ న మ్మకాలకు భక్తులు స్వస్తి పలకి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకడం శుభ పరిణామమని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీడీ మణెమ్మ, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శాం నాయక్, ట్రాన్స్‌కో ఈఈ శేశరావ్, బాబా సతిమణి దృపదబాయి, సంస్థాన్ అధ్యక్షులు ఇంగ్లే కేశవ్ రావ్, గౌరవ అధ్యక్షులు వామన్‌రావ్ ఇంగ్లే, ప్రధాన కార్యదర్శులు డుక్రె సుభాష్, మాగాడె దాదారావ్, కిన్వట్ ఎమ్మెల్యే కేరం భీంరావ్, యావత్‌మాల్ మాజీ మంత్రి శివాజీరావ్ మోగె, మాజీ ఎమ్మెల్యే ఉత్తంరావ్ ఇంగ్లే, రంగారావ్ పాటిల్, మాజీ సర్పంచ్ కందారె బాలాజీ, జనార్ధన్, బర్గె బళిరాం, ఆత్రం రాము, గిరె సుదాం, పూసం భీంరావ్, పెందుర్ లచ్చు తదితరులు పాల్గొన్నారు. కాగా పులాజీబాబా జన్మదిన వేడుకలకు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఆంధ్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులతో పాటు ఎంపీ గోడాం నగేష్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తదితరులు బాబా సమాధి మందిరంలో పూజలు నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీలకు కమిటీ సభ్యులు మెమోంటోలను అందజేశారు. వేడుకలకు హాజరయ్యే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపారు. వైద్య సిబ్బంది వేడుకల్లో అనారోగ్యానికి గురైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. సీఐ వెల్పుల రమేశ్ పర్యవేక్షణలో ఎసై రవికుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ నగేష్

ఉద్యోగులకు సేవలే గుర్తింపునిస్తాయి

వాంకిడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ పదవి కాలంలో ప్రజలకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డీపీవో బిక్షపతిగౌడ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోఎంపీడీవోగా పనిచేన ప్రవీణ్‌కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి వారు హాజరై సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఉమర్, ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో ఖాజా అజీజోద్దిన్, ఈజీఎస్ ఏపీవో శ్రావణ్, ఎంఈవో శివచరన్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ జాబిరే పెంటు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కాగజ్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం మోసం గ్రామపంచాయతీ పరిధిలోని ఆరెగూడ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా నియమితులైన లక్ష్మీనారాయణను ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ బిల్లులను అడిగి తెలుసుకున్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): పదోన్నతిపై మండల కేంద్రంలో గల మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా ఇటీవల వచ్చిన ఆత్రం దత్తును మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఆడ వెంకటేష్, సేడ్మకి సీతారాం, గ్రామ పటేలు ఆత్రం ఆనంద్‌రావు, దుర్వ మోతిరాం, ఉపాధ్యాయుడు ఆడ జంగు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోనే ఉంటా

చింతలమానేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని, తాను కొందరు పార్టీ మారుతారని చేస్తున్న దుష్ప్రచారాలు మానుకోవాలని మాజీ ఎంపీపీ నానయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై కొందరు పార్టీ మారుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని ఇది సరికాదని చెప్పారు. తాను ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ప్రజలు నమ్మకూడదని కోరారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, రాజన్న, రామన్న, పోశం, సత్తన్న, విజయ్, పోశన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు ప్రత్యేక పూజలు



ఆసిఫాబాద్‌లో పూజలు చేస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజార్‌వాడీ గణేశ్ మండలి వద్ద శనివారం గణనాథుడిని బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వెంట నాయకులు మల్లికార్జున్, దీపక్‌రావ్, సత్యనారాయణ, సంతోష్, శ్రీకాంత్, మల్లికార్జున్, కోటేష్, నవీన్ తదితరులు ఉన్నారు. సీఐ బాలాజీ వరప్రసాద్ ఆంజనేయ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమర్థసాయి గణేశ్ మండలి వద్ద నిర్వహించిన అన్నదాన ంలో పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): శివాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన సార్వజనిక్ గణనాథుడికి జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, భక్తులతో కలిసి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండలి సభ్యులు రమేశ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపైన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అఖిల పక్ష సమావేశం నిర్వహించి అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించామని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ఆసిఫాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): ఓటర్ల సవరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఓటరు జాబితాపై అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీవో గౌరిశంకర్, ఏపీవో రాజన్న, జూనియర్ అసిస్టెంట్ వసంత్, నాయకులు శ్రీవర్ధన్, తిరుపతి, వసీఖాన్, రాకేష్, దిగంబర్, రాజన్న, సురేష్‌గౌడ్, షణ్ముఖ పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపైన పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేందర్ అభ్యంతరాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రవి, నాయకులు ధనుంజయ్, భీమన్న, వెంకటేష్, సంజీవ్, షాకీర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాల యంలో ఆయా పంచాయతీల ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపైన పలు రాజకీయ పార్టీల అఖిల పక్ష నాయకులతో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో తో పాటు వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై రాజకీ పార్టీల నాయకులతో ఎంపీడీవో సత్యనారాయణ సమావేశం నిర్వహించారు. అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలాల తుది ఓటరు జాబితాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కోట ప్రసాద్ అభ్యంతరాలపై ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య


కవిత(ఫైల్)

కాగజ్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో పిల్లలు పుట్టడం లేదన్న మనస్తాపంతో శుక్రవారం రాత్రి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన మిరుదొడ్డి కవిత(41) ఉపాధ్యాయురాలిగా జడ్పీహెచ్ పాఠశాల కౌటాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమెకు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొంత కాలంగా చర్మ సంబంధిత వ్యాధితో ఇబ్బందులు పడుతున్నారు. కాగా పిల్లలు పుట్టడం లేదని కొన్ని రోజులుగా మనస్తాపంతో ఉంటున్నారు. శుక్రవారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు పేర్కొన్నారు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీలు గౌరవంగా బతకాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఖైదీలందరు కష్ట పడి పని చేసి గౌరవంగా బతకాలని న్యాయసేవా సంస్థ సెక్రటరీ కె యువరాజ అన్నారు. జిల్లా సబ్ జైలులో న్యాయ సేవాధికారి ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనంతటి మనం ఏ తప్పు చేయకుండా బతికితేనే మనకు చాలా గౌరవంగా ఉంటుందని సూచించారు. యువత చక్కగా చదువుకోవాలని, ఎవరు ఎవరిని మోసం చేయకూడదని సూచించారు. ఎవరు కూడా గంజాయిని సాగు చేయడం, అమ్మడం, సేవించడం చేస్తే శిక్షార్హులవుతారన్నారు. ఖైదీల బాగోగులను ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులోని వంట గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ ప్రేంకుమార్, డిప్యూటీ లీగల్ డిఫెన్స్‌కౌన్సిల్ డి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ అంజనీదేవి, కోర్టు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూలాజీబాబా జన్మదిన వేడుకలు

సిర్పూర్(యు), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పూలాజీ బాబా జన్మదిన వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలాజీ మఠంలో బాబా జెండాను ఆవిష్కరించారు పూలాజీ బాబా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు మాట్లాడుతూ పూలాజీ బాబా అనుసరించిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆర్క నాగోరావు, ఆత్రం ఓంప్రకాష్, నాయకులు తోడసం ధర్మరావు, గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావు, భక్తులు కోట్నాక పాండురంగ్, పూలాజజీ బాబా ధ్యాన కేంద్రం సభ్యులు దత్తు, అనిల్, పుండలిక్, కమలకార్, జ్యోతిరాం, మూర్తి పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం, సావర్‌ఖేడ, కేస్లాగూడ, ఖైరి గ్రామాల్లో ఆధ్యాత్మిక గురువు పూలాజీబాబా జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం భజనలు, సంకీర్తన కార్యక్రమాలను చేసి కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ధాన్య కేంద్రం అధ్యక్షుడు లక్ష్మణ్, ముకుంద్‌రావు, గ్రామ పటేల్ శంకర్, బాపూజీ, మొండయ్య, పాండు, ఏమాజీ, మోగేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పెంచికలపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్సై అనీల్‌కుమార్ అన్నారు. పోతపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సివిల్స్ రైట్స్ డే కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల న్నారు. అనంతరం పోతెపల్లి గ్రామ యువకులు ఎస్సైని శాలువా తో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, మాజీ సర్పంచ్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో వ్యవసాయం



- వాట్సాప్ ఛానల్‌కు ప్రభుత్వం శ్రీకారం
- రైతులకు సమాచారం చేరవేత
- పంటల సంరక్షణ, సబ్సిడీలు తెలుసుకునే అవకాశం

బెజ్జూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):వ్యవసాయం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. దాదాపు ప్రతిరైతు దగ్గర సెల్‌ఫోన్ ఉంటుంది. అరచేతిలో రైతులకు పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. దీనికి తగినట్లుగానే తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారిక వాట్సాప్ ఛానల్‌ను తొలిసారిగా అందుబాటులోకి తెచ్చింది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో దీన్ని ప్రారంభించింది. కొత్తగా ప్రారంభించిన యాప్‌పై ఆసిఫాబాద్ జిల్లాలోని రైతులకు వ్యవసాయ శాఖ అవగాహన కల్పిస్తోంది. ప్రతి వ్యవసాయ క్లస్టర్‌లో వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈవో) కనీసం 100మంది రైతుల సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి ఆదేశించారు.

రైతులకు లభించే సమాచారం ఇలా..

- ప్రభుత్వ పథకాలు, రాయితీ వివరాలు
- పంటల సంరక్షణ, కాలానుగుణ సూచనలు
- వాతావరణ హెచ్చరికలు, కీటక నియంత్రణ మార్గదర్శకాలు
- మార్కెట్ ధరలు, శిక్షణ కార్యక్రమాలు, తదితరాలు

రైతునేస్తం కార్యక్రమాల షెడ్యూల్, రాష్ట్రంలోని 1,600 రైతువేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లలో నిర్వహించబోయే అంశాల సమాచారాన్ని ఈ వాట్సాప్ చానెల్ ద్వారా వ్యయసాయ శాఖ చేరవేస్తోంది.

సకాలంలో సూచనలు, సలహాలు..

కాలానికి అనుగుణంగా పంటల దశలను బట్టి వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు అందిపుచ్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. వాతావరణ శాఖ సలహాలు, సూచనలు సైతం అందుబాటులోకి తెస్తోంది. సమయానుకూలమైన, నమ్మకమైన, ఉపయోగకరమైన సమాచారం నేరుగా రైతుల చేతుల్లోకి చేరుతుంది. వ్యవసాయంలో ఉత్పాదకత, రైతు ఆదాయం పెంపు, స్థిరమైన వ్యవసాయం వైపు ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు.

రైతులు సబ్‌స్ర్కైబ్ చేసుకోవాలి..

నాగరాజు, వ్యవసాయ అధికారి, బెజ్జూరు



రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిన అధికారిక వాట్సాప్ ఛానల్‌ను రైతులందరూ వినియోగించుకోవాలి. రైతులు తమ కార్యాలయంలో గానీ తమను నేరుగా కలిసి వాట్సాప్ ఛానల్‌ను సబ్‌స్ర్కైబ్ చేసుకోవచ్చు. రైతులకు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు అందుతాయి. రైతులు వెంటనే ఛానల్‌ను సబ్‌స్ర్కైబ్ చేసుకోవాలి.

ఎస్‌బీఐ స్కామ్‌లో ప్రత్యేక బృందాల గాలింపు

- 70 శాతం బంగారం రికవరీ - ప్రైవేటు బ్యాంకుల్లోనూ అధికారుల తనిఖీలు

చెన్నూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎస్‌బీఐ బ్యాంక్ 2లో జరిగిన స్కామ్‌పై ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చేపడుతున్నాయి. ఇప్పటికే ప్రధాన సూత్రదారి క్యాషియర్ రవీందర్‌తో పాటు అతని అనుచరులు పోలీసుల ఆధీనంలో ఉండగా ఓ వైపు విచారణ సాగిస్తూనే వారు చెబుతున్న సమాచారం మేరకు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. రెండు రోజులుగా చెన్నూరు, మంచిర్యాల పట్టణం లోని పలు ప్రైవేటు బ్యాంకుల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు, చెన్నూరు రూరల్ సీఐలు దేవేందర్‌రావు, బన్సీలాల్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌ల ఆధ్వర్యం లో పోలీసు బృందాలు ప్రైవేటు బ్యాంకుల నుంచి క్యాషియర్ తనఖా పెట్టిన బంగారాన్ని రికవరీ చేస్తున్నారు.

402 మందికి సంబంధించి..

బ్యాంకు స్కామ్‌లో గోల్డ్‌లోన్ తీసుకున్న బాధితులు 402 మంది ఉండగా వీరికి సంబంధించిన 20 కిలోల 496 గ్రాముల బంగారాన్ని క్యాషియర్ రవీందర్ మాయం చేశాడు. ఈ బంగారాన్ని బ్యాంకు క్యాషియర్ తన అనుచరుల ద్వారా వివిధ బ్యాంకుల్లో తనాఖా పెట్టిన రుణాన్ని పొందినట్లు గుర్తించిన పోలీసులు సదరు బ్యాంకుల్లో తనిఖీలు చేస్తూ బంగారాన్ని రికవరీ చేస్తున్నారు. ఇప్పటికైతే 70 శాతం బంగారం రికవరీ అయినట్లు సమాచారం. మంచిర్యాల పట్టణంలోని ఎస్‌బీఎఫ్‌సీ బ్యాంకులో ఏడున్నర కిలోలు, మణప్పురం గోల్డ్‌లోన్ బ్యాంకులో 5 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలియగా, మంచిర్యాలలోని ముత్తూట్ , చెన్నూరులోని ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో ఒక్కో బ్యాంకులో అరకిలో చొప్పున నిందితులు తాకట్టు పెట్టగా ఈ బంగారం ఇచ్చేందుకు సదరు బ్యాంకు అధికారులు సముఖత వ్యక్తం చేయడం లేదు. మంచిర్యాలలోని ముత్తూట్ ఫిన్‌కార్ప్ అధికారులైతే బ్యాంకుకు తాళం వేసి వెళ్లిపోయారు. చెన్నూరులోని ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో శనివారం రాత్రి వరకు పోలీసు బృందాలు తనిఖీలు చేపట్టారు. ఇక్కడి బ్యాంకు అధికారులు సైతం బంగారం ఇవ్వడానికి నిరాకరించినట్లు తెలుస్తోంది..



ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో విచారణ చేస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో పోలీసుల అదుపులో ఉన్న క్యాషియర్ అనుచరుడు)

ముత్తూట్ కార్యాలయం ఎదుట ఆందోళన

మంచిర్యాలక్రైం: చెన్నూర్ ఎస్‌బీఐలో బంగారం తాకట్టుపెట్టిన బాధితులు మంచిర్యాల పట్టణం మెయిన్ రోడ్డులోని ముత్తూట్ ఫిన్‌కార్ప్ గోల్డ్‌లోన్ కార్యాలయంలో ఆందోళనకు దిగారు. బాధితులు మాట్లాడుతూ కష్టపడి సంపాదించుకున్న బంగారాన్ని అవసరం కోసం ఎస్‌బీఐలో తాకట్టుపెట్టామన్నారు. ఎస్‌బీఐలో స్కాం జరుగడం వల్ల తమ బంగారాన్ని కొందరు ముత్తూట్‌లో కుదువపెట్టారని, ఎలాంటి బిల్లులు లేకుండా ఎలా కుదువపె ట్టుకున్నారని ప్రశ్నించారు. వెంటనే తమ బంగారాన్ని తమకు అప్పగించాలని సుమారు 20 మంది బాధితులు ఆందోళనకు దిగారు. ముత్తూట్ మేనేజర్ తమకు నోటీసులు అందాయని, సోమవారం దీనిపై హెడ్ ఆఫీస్‌కు సమాచారం అందించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పడంతో బాధితులు వెళ్లిపోయారు.

పోలీసుల అదుపులో 15 మంది నిందితులు

చెన్నూరు ఎస్‌బీఐ బ్యాంక్ 2లో జరిగిన స్కామ్‌లో క్యాషియర్ రవీందర్‌తో పాటు అతని అనుచరులు 15 మంది నిందితులు పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. మొత్తంగా బ్యాంకు స్కామ్‌లో క్యాషియర్ రవీందర్‌కు 43 మంది మిత్రులు, బంధువులు సహకరించినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో పోలీసులు ఇప్పటికే 15 మంది నిందితులను ఆధీనంలోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న మిగితా నిందితులు దొరికితే మొత్తం బంగారం లభ్యమయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.

గోడ ప్రతుల ఆవిష్కరణ

కాగజ్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానం వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు పర్చాలని సెప్టెంబరు 1న ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం కాగజ్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీపీఎస్ విధానం వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో టీజీఇజేఏసీ జిల్లా కో చైర్మన్లు జయదేవ్ అబ్రహం, ఎ.శ్రీనివాస రావు, వి శాంతికుమారి. నాయకులు ఎం శివప్రసాద్, బి నర్సయ్య, ఎం మురళీధర్ రావు, పురుషోత్తం పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సెప్టెంబరు 1న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో చేపట్టే నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను టీఎస్జీవో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్టీజో అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ సీపీఎస్ విధానం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూఎస్పీసీ రాష్ట్ర నాయకులు మేడి చరణ్ దాస్, దూడ రాజనర్సుబాబు పాల్గొన్నారు.

గణిత విజ్ఞాన మేళా

కాగజ్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో శనివారం గణిత జ్ఞాన విజ్ఞాన మేళాను ప్రముఖ వైద్యుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. . కార్యక్రమం లో జిల్లా అధ్యక్షురాలు కొత్తపల్లి అనిత, కార్యదర్శి రాజన్న, మైలారపు మురళి, హితేష్ అగర్వాల్ పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

దహెగాం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి గ్రామంలో గొర్లపల్లి ఆనంద్ రావు స్వేరోస్ నేతృత్వంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి గడ్డి మందు పిచికారి చేశారు. గ్రామస్థులు వ్యాధుల బారిన పడకుండా చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగిస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాకు విద్యార్థుల ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో ఆసిఫాబాద్ పట్టణానికి శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు శార్వాని, వెంకట రత్న, చరణ్, సాకేత్, హరిచంద్, జశ్వంత్, విక్రమ్, రేవంత్, సహస్ర, శ్రీనిధిలు రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాకు ఎంపికైనట్లు ప్రధానాచార్యులు కోటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సెప్టెంబరు 3, 4, 5 తేదీల్లో కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాలో పాల్గొంటారని తెలిపారు.

ఎస్టీపీపీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

జైపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎస్టీపీపీ ఆధ్వర్యంలో శనివారం జైపూర్‌లోని గ్రామపంచాయతీ భవనంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ డిస్పెన్సరీ వైద్యులు రవీందర్ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ శిబిరానికి అతిథిగా హాజరైన ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి మాట్లాడుతూ ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లోని ప్రజల ఆరోగ్యం కోసం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నా మన్నారు. . కార్యక్రమంలో అధికారులు కిరణ్‌బాబు, ఠాకూర్ మోహన్‌సింగ్, రవీందర్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ అధికారికి సన్మానం

జైపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి థర్మల్‌పవర్ ప్లాంట్‌లో చీఫ్ ఆఫ్ (ఓఅండ్ఎం)గా విధులునిర్వర్తించిన జేఎస్ సింగ్ కాంట్రాక్టు పీరియడ్ ఈ నెల 31తో ముగుస్తున్న సందర్భంగా శనివారం సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ, అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, అధికారులు నర్సింహారావు, శ్రీనివాస్, మురళీధర్, మదన్‌మోహన్, అజాజు ల్లాఖాన్, శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, కిరణ్‌బాబు, వెంకటయ్య, చంద్రమణి పాల్గొన్నారు.

రక్షణ బహుమతుల్లో శ్రీరాంపూర్ టాప్

- సింగరేణి వ్యాప్తంగా అధికంగా కైవసం
- నేడు ప్రదానం చేయనున్న డీజీఎంఎస్ అధికారులు


సమీక్ష నిర్వహిస్తున్న డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా రక్షణ బహుమతుల్లో శ్రీరాంపూర్ అధికంగా కైవసం చేసుకున్నది. 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు-2023కు సంబంధించిన బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. శ్రీరాంపూర్ లోని ప్రగతి మైదానంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉజ్వల్ థా రానున్నారు. ఈ కార్యక్రమానికి సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అధ్యక్షత వహిస్తారు.

ఏటా రక్షణ పక్షోత్సవాలు..

ఏటా రక్షణ పక్షోత్సవాలను నిర్వహించి వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన గనులకు బహుమతులు అందించడం ఆనవాయితీగా వస్తోంది. వార్షిక రక్షణ పక్షోత్సవాలు-2023లో భాగంగా 09-12-2024 నుంచి 21-12-2024 వరకు అధికారులతో కూడిన కమిటీ సింగరేణిలోని వివిధ గనులను సందర్శించి వివిధ కేటగిరీల్లో పరిశీలన చేశారు. ఉత్తమ గనులు, విభాగాలను ఎంపిక చేశారు. ఇప్పటికే బహుమతులు అందించాల్సి ఉంది. కానీ వివిధ కార్యక్రమాలు, ఉత్పత్తి, ఇతర అంశాల వలన ప్రదానోత్సవం వాయిదా పడుతూ వచ్చింది. చివరకు 2025లో కుదిరింది. కాగా గతంలో శ్రీరాంపూర్ ఏరియాలో రక్షణ వార్షిక బహుమతులు అం దించిన సందర్భాలున్నాయి. 2004, 2009లలో బహుమ తుల ప్రదానోత్సవం శ్రీరాంపూర్ ఏరియాలో జరిగింది. 2016లో అనుకున్నా క్యాన్సిల్ అయ్యింది. అనంతరం 2018లో మరోసారి నిర్వహించారు. రక్షణ బహుమతులు శ్రీరాంపూర్‌లో అందించడం ఇది నాలుగోసారి.

అన్ని కేటగిరీల్లో..

సింగరేణివ్యాప్తంగా ఉన్న గనులు, విభాగాల నుంచి శ్రీరాంపూర్ ఏరియా అన్ని కేటగిరీల్లో అత్యధిక బహుమతులు గెలుచుకుంది. రక్షణ కేటగిరీలో అండర్‌గ్రౌండ్ గ్రూప్-1లో ఆర్కే-7 గని మొదటి బహుమతి, గ్రూప్-2లో ఆర్కే-న్యూటెక్ గని రెండో బహుమతి, గ్రూప్-3లో ఇందారం-1ఏ గని మొదటి బహుమతి, ఎస్ఆర్‌పీ 3,3ఏ గని రెండవ బహుమతి, థర్స్ట్ ఏరియా అంశంలో ఇందారం 1ఏ గని మొదటి బహుమతి, సాండ్ స్టోయింగ్‌లో ఆర్కే-7 గని రెండవ బహుమతి, పిట్ సేఫ్టీ కమిటీ గ్రూప్-2లో ఆర్కే-5 ఇంక్లైన్ మొదటి బహువతి, బెస్ట్ ఫస్ట్ ఎయిడ్‌లో ఆర్కే-6 గని మొదటి బహుమతి సాధించాయి. రక్షణలో శ్రీరాంపూర్ ఓసీపీ గ్రూప్-1లో రెండవ బహుమతి, బెస్ట్ ఫస్ట్ ఎయిడ్‌లో మొదటి బహుమతి, గ్రూప్-3 థర్స్ట్ ఏరియాలో ఇందారం ఓసీపీ మొదటి బహుమతి, రక్షణ, బెస్ట్ ఫస్ట్ ఎయిడ్‌లో ఏరియా వర్క్‌షాప్ మొదటి బహుమతి, ఓహెచ్ఎస్ విభాగంలో నస్పూర్ డిస్పెన్సరీ మొదటి బహుమతి, బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ భూగర్భ గని విభాగంలో ఆర్కే-5 ఇంక్లైన్ రెండవ బహుమతి, ఉపరితల గని విభాగంలో ఇందారం ఓసీపీ మూడో బహుమతి, శ్రీరాంపూర్ సీహెచ్‌పీ రెండో బహుమతి, యాక్సిడెంట్ ఫ్రీ వర్క్‌మెన్ విభాగంలో శ్రీరాంపూర్‌ఓసీపీకి చెందిన అబ్దుల్ రజాక్, సోలార్ పవర్ విభాగంలో ఎస్టీపీపీ 10 మెగావాట్ల యూనిట్ మొదటి బహుమతి పొందాయి. ఆయా గనుల మేనేజర్లు, అధిపతులు, రక్షణ అధికారులు, వర్క్‌మెన్ ప్రతినిధులు బహుమతులు అందుకుంటారు.

సింగరేణి సమాచారం



మందమర్రి జీఎంగా రాధాకృష్ణ


రాధాకృష్ణ

మందమర్రిటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియా జీఎంగా కొత్తగూడెం కార్పొరేట్ ఎస్టేట్ విభాగంలో నిచేస్తున్న రాధాకృష్ణ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఈయన ఆర్కే ఓసీపీ మేనేజర్‌గా పనిచేశారు.

గిరిజన డైరెక్టర్ నియామకంపై హర్షం

జైపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ 139 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా ఎస్టీ కోయ కమ్యూనిటీకి చెందిన గిరిజన అధికారి తిరుమల్‌రావు డైరెక్టర్ ఈఅండ్ఎంగా నియమితులు కావడం హర్షనీయమని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంతుల నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగుల్లో, ముఖ్యంగా గిరిజన సిబ్బందిలో ఆనందాన్ని నింపిందని పేర్కొన్నారు. ఈ నియామకానికి సహకారం అందించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, సింగరేణి సీఎండీ బలరాంలకు సంఘం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు.


ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేత

శ్రీరాంపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఓ ఫామ్‌లను డిజిటలైజేషన్ చేసిన ఆర్కే 8 డిస్పెన్సరీ ఉద్యోగులను అధికారులు అభినందించారు. డిస్పెన్సరీలో ఏర్పాటు చేసిన సమావేశానికి శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్, కార్పొరేట్ జీఎం(రక్షణ) చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, రామగుండం రీజియన్ జీఎం(రక్షణ) మధుసూదన్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మౌనిక, నాగేంద్రవర్మ, రజిత, విజయలక్ష్మి, లలిత, మహేష్‌కుమార్, అరుణ కుమాకి ప్రశంసాపత్రాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ మురళీధర్, డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగుల రక్తదానం

శ్రీరాంపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సంక్షేమ సంఘం(140/2018) ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 40 మంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం అందించనున్నట్లు సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్, కార్పొరేట్ జీఎం(రక్షణ) చింతల శ్రీనివాస్, సింగరేణి సీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్, బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, రామగుండం రీజియన్ జీఎం(రక్షణ) మధుసూదన్ హాజరై రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో అందె వెంకటేష్, నక్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.


కేకే ఓసీపీ సందర్శన


కేకే ఓసీపీని సందర్శిస్తున్న అధికారులు

మందమర్రిటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏరియాలోని కేకే ఓసీపీని శనివారం కొత్తగూడెం జీఎం పీపీ సాయిబాబా, జీఎం (ఓసీపీఎస్)సూర్యనారాయణరాజులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ప్రగతే లక్ష్యంగా కార్మికులు, అధికారులు అంకిత భావంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రమాద రహిత ఉత్పత్తికి కృషి చేయాలన్నారు. రక్షణ సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో జీఎం అండర్‌గ్రౌండ్ రఘురామ రెడ్డి, రవి, ఓసీపీ ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, గని మేనేజర్ రామ రాజు, ఇంజనీర్ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్ ద్వైపాక్షిక మహాసభలు ప్రారంభం

శ్రీరాంపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు నిర్వహించనున్న హెచ్‌ఎంఎస్ 26వ ద్వైపాక్షిక మహాసభలు నస్పూర్ కాలనీలోని గోదావరి ఫంక్షన్‌హాల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. హెచ్‌ఎంఎస్ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య అధ్యక్షత వహించగా, ముందుగా హెచ్‌ఎంఎస్ జెండాను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర కమిటీ కార్యవర్గం, 12 ఏరియాలకు చెందిన ఉపాధ్యక్షులు, బ్రాంచ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రియాజ్ అహ్మద్ మాట్లాడారు. ఈ సమావేశంలో సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్‌ను అఖిల భారత మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్‌గా మార్పు చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ కుట్రల నుంచి యూనియన్‌ను కాపాడుకోవడం, సింగరేణి ఒడిషా లాంటి రాష్ట్రాలకు విస్తరించడం వల్ల ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. సింగరేణి పరిరక్షణ, నూతన భూగర్భ గనుల సాధనకు, కార్మిక హక్కులతో పాటు ఇతర సమస్యలు సాధనకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నుకోవాలని నిర్ణయించారు. ఇతర ప్రధాన సమస్యలపై ఆదివారం జరిగే మహాసభల్లో ప్రవేశపెట్టి తీర్మానం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గడిపెల్లి కృష్ణ ప్రసాద్, శ్రీరాంపూర్ ఏయా ఉపాధ్యక్షుడు వి. అనిల్ రెడ్డి, బ్రాంచ్ కార్యదర్శి పొనగంటి అశోక్‌తో పాటు ఇతర ఏరియాలకు చెందిన ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఎస్టీపీపీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

సంక్షిప్త సమాచారం

మందమర్రిరూరల్ : మండలంలోని పులిమడుగు గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ సతీష్‌కుమార్‌లు భూమి పూజ నిర్వహించారు.

●రాబోయే పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ఉన్న కొందరు ఓటర్లు గ్రామీణ ప్రాంతాల్లో ఓటరుగా నమోదు చేసుకున్నారని అలాంటి వారిని గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించాలని కోరుతూ రాజకీయ పార్టీల నాయకులు శనివారం మండల ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ సతీష్‌కుమార్‌లకు వినతి పత్రాలు అందించారు.

జన్నారం: మండల కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా ఎండీ షాకీర్ అలీ, కో కోఆర్డినేటర్‌గా రాహుల్ యాదవ్‌ను నియమిస్తూ శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నియమిస్తూ నియామకపత్రాలు అందజేశారు.

తాండూర్ : గంజాయి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం విద్యాభారతి ఉన్నత పాఠశాలలో కళాబృందంతో విద్యార్థులకు సమాజంలో జరిగే మంచి చెడులపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, పోలీసులు , విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట: ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చసిన రొడ్డ చిన్న రమేశ్ 5వ వర్ధంతి వేడుకలను శనివారం దేవాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, బద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాసిపేట: రెండవ సాధారణ స్థానిక సంస్థలు 2025 సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల డ్రాఫ్ట్ ఫొటో ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ మాట్లాడుతూ డ్రాఫ్ట్ ఓటరు జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలుపాలని ఆయన సూచించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బీవీ రమణరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు సూరం సంపత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైదం రమేశ్, స్థానిక నాయ కులు అగ్గి సత్తయ్య, రాంటెంకి వాసుదేవ్ పాల్గొన్నారు.

భీమిని : సమాజంలో ఎవరి హక్కులకు భంగం కలిగించవద్దని గ్రామ కార్యదర్శి సత్యనారాయణ రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్ఐ వెంకటేష్, కానిస్టేబుల్ వినోద్, ఉన్నారు.

మందమర్రిరూరల్ : రాబోయే పంచాయతీల ఎన్నికల సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో శనివారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో రాజేశ్వర్ సమావేశం నిర్వహించారు. నాయకుల అభిప్రాయాలను స్వీకరించారు. మాజీజెడ్పీటీసీ రవి, దుర్గరాజ్ తదితరులు పాల్గొన్నారు.

●ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కనయ్‌లాల్ దత్తా జయంతి వేడుకలను శనివారం రిటైర్డు ఆర్మీ జవాన్, ప్రస్తుత ఎస్‌అండ్‌పీసీ ఉద్యోగి రాజేష్ ప్రిహ్వాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాణి ప్రిహ్వాల్, ప్రభుదేవ్, రాజ్‌కుమార్, శ్రీహరి, లావణ్య పాల్గొన్నారు.

●ఆదిల్‌పేట, పొన్నారం, అందుగులపేట గ్రామాల్లో గణనాధునికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని విశ్రాంతి భవనంలో శనివారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నూతనంగా నియమించ బడిన లక్షెట్టిపేట మాజీ జడ్పీటీసీ ముత్తె సత్తయ్య, జిల్లా కోశాధికారి గా నియమితులైన రమేష్ చంద్ జైన్‌ను బీజేపీ మండల, పట్టణ కమిటి నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు హేమంత్ రెడ్డి, నాయకులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనానికి తప్పనున్న తిప్పలు

● పాఠశాలల్లోని ఏజెన్సీలకు గ్యాస్ కనెక్షన్‌లు ● ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన అధికారులు

కోటపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబం ధించి ఇక పొగ బాధ తప్పనుంది. ఇంతకాలం మధ్యాహ్న భోజనం కట్టెలపైనే నిర్వహిస్తుండగా తాజాగా ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణ యించింది. మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ నిర్వాహ కులకు గ్యాస్ కనెక్షన్‌లు అందించేందుకు విద్యాశాఖ నిర్ణయించింది. ఇప్పటికే పాత వంట పాత్రల స్థానంలో నాణ్యతతో కూడిన కొత్త పాత్రలను అందించిన ప్రభుత్వం ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్‌ల మంజూరుపై దృష్టి సారించింది.

ఇక నుంచి కట్టెల పొయ్యిపై కాకుండా ఎల్‌పీజీని ఉపయోగించి వంట చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించగా ఈ నెల 15 లోగా అన్ని బడుల్లో గ్యాస్‌పైనే వంట చేయాలనే ఆదేశాలు అందాయి. కట్టెల పొయ్యితో భోజనం తయారు చేయడంతో వంట ఏజెన్సీలకు ఎన్నో కష్టాలు ఎదురవుతున్నాయి. ఆరు బయట కట్టెలతో వంట చేయడం వల్ల ఆహారం నాణ్యత, రుచి పోవడమే కాకుండా పొగ పీల్చడం, అపరిశుభ్రమైన పరిస్థితుల కారణంగా వంట ఏజెన్సీల మహిళలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ దశలో అన్ని పాఠశాలల్లో వంట ఏజెన్సీల పేరిట ఎల్‌పీజీ కనెక్షన్‌ల జారీకి చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి.

సిలిండర్ల భారం ఎవరిపై..

ప్రభుత్వం మధ్యాహ్న భోజనం వంటకు గ్యాస్ పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించగా మరి సిలిండర్ల భారం ఎవరిపై పడుతుందనేది స్పష్టంగా తెలియరావడం లేదు. గ్యాస్ కనెక్షన్‌లు ఇచ్చినా నెల నెల సిలిండర్ సరఫరా చేస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది. నెలకు ఎన్ని గ్యాస్ సిలిండర్లు అవసరం అవుతాయో, ఎన్ని పంపిణీ చేస్తారో అనేది ఇంకా తెలియరాలేదు.

అయితే వంట ఏజెన్సీ నిర్వాహకులే కొనుగోలు చేయాలంటే వారిపై ఆర్థిక భారం తప్పేలా లేదు. ఏజెన్సీలకు చెల్లించేది అంతంత మాత్రమే కావ డంతో సిలిండర్ల కొనుగోలుపై విముఖత వ్యక్తమవుతోంది. ఒక వేళ ఉచితంగా సరఫరా చేయకుంటే మళ్లీ మొదటికి వచ్చి కట్టెల పొయ్యే దిక్కయ్యేలా ఉంది. అయితే ప్రభుత్వం ఈ నెల 15లోగా సర్కారు బడుల్లో గ్యాస్ కనెక్షన్‌లు అందించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినా ఇప్పటి వరకు దీనిపై సంబంధిత శాఖ తీసుకున్న చర్యలు మాత్రం ఏమి కానరావడం లేదు. దీంతో గ్యాస్ కనెక్షన్‌ల పంపిణీకి ఆదిలోనే అవాంతరాలు ఎదురవుతాయా అనేది ప్రశ్నార్థకంగా మిగులుతోంది.

గతంలో కొన్ని పాఠశాలలకు

గతంలో కొన్ని పాఠశాలలకు మాత్రమే గ్యాస్ పంపిణీ చేశారు. మొత్తంగా 747 పాఠశాలలు ఉండ గా 71 పాఠశాలలకు మాత్రమే గ్యాస్ పంపిణీ అయ్యింది. పంపిణీ అయిన పాఠశాలల్లోనూ ప్రస్తుతం గ్యాస్‌పైన వండకుండా కట్టెల పొయ్యిపైనే వండుతుండడంతో సి లిండర్లు అటకెక్కాయి. ఇక మిగితా పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్, పొయ్యిల పంపిణీ జరగలేదు. దీంతో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ అటు కార్మికులు ఇటు పొగ బాధతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అవస్థల మధ్య ఆఖరి మజిలీ



బురద రోడ్డుపై నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్తున్న బంధువులు

భీమారం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గ్రామస్థులు ఆఖరి మజిలీకి అవస్థలు పడాల్సిన పరిస్థితులు ఏర్పాడుతున్నాయి. ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన సూరం లచ్చిరెడ్డి(55) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో కుటుంబీకులు, బంధువులు శ్మశాన వాటికకు తీసుకు వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామం నుంచి సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో శ్మశాన వాటిక ఉంది. అక్కడికి వెళ్లే దారి మట్టి రోడ్డు కావడంతో ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డంతా బురదమయంగా మారింది. మోకాలు వరకు బురద పేరుకుపోయి ఉండడంతో లచ్చిరెడ్డి మృతదేహాన్ని అవస్థలు పడుతూ మోసుకుంటూ శ్మశాన వాటిక వరకు తీసుకువెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు.

సులువుగా అర్థమయ్యేలా బోధించాలి

లక్షెట్టిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులకు సులువుగా అర్థం అయ్యే విధంగా బోధించాలని ఎంఈవో శైలజ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో లక్షెట్టిపేట మండల స్థాయి బోధనాభ్యాస సామగ్రి మేళా నిర్వహించారు. సులువుగా అర్థం కావాలని టిఎల్ఎం పద్ధతిని ప్రవేశపెట్టారన్నారు. అనంతరం తెలుగు, ఇంగ్లీష్ గణితం తదితర సబ్జెక్టులపై ఈవీఎస్ లకు సంభందిచి టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలో వామనమూర్తి, యశోధర, పర్వీన్ సుల్తానాతో పాటు ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తాండూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) :రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం యూరియా కొరతకు వ్యతిరేకంగా తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులకు ఎన్నడు యూరియా కొరత లేదని, రైతులు ఇబ్బందులు పడలేదని తెలిపారు. కాంగ్రెస్ 20 నెలల పాలనలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, యూరియా దొరక్క పంటలు నష్టపోతున్నారన్నారు. సింగిల్ విండో చైర్మన్ దత్తుమూర్తి, మాజీ ఎంపీపీ ప్రణయ్‌కుమార్, నాయకులు శంకర్, స్వామి, దత్తాత్రేయరావు, శ్రీరాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చనలు

దండేపల్లి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రుల ఉత్సావాల్లో భాగంగా శనివారం దండేపల్లి మండలంలోని గణేష్ మండల వద్ద విఘ్నేశ్వరుడికి భక్తుల ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లిం చుకున్నారు. దండేపల్లిలో స్థానిక రామాలయంలో వినాయక మండపం వద్ద ఆర్య వైశ్య మహిళలు కుంకు మార్చన పూజలు చేశారు.దండేపల్లిలో సిద్ది వినాయక మండపం వద్ద 4వ రోజున నిత్య అన్నదానం నిర్వహిస్తున్నారు.

కరెన్సీతో అలంకరణ..



మందమర్రి పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో గల బాలాజీ గణేష్ మండపంలో శనివారం లక్షా 8వేల రూపాయలతో నిర్వాహకులు వినాయకుడిని అలంకరించారు. ఇందులో 50, 100, 200 నోట్లను వాడారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. **-మందమర్రి టౌన్**

స్థానిక సమరానికి గ్రీన్ సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

అధనంగా రెండు స్థానాలను పెంచగా, మొత్తం ఎంపీటీసీ స్థానాల సంఖ్యకు 129కి చేరింది. అలాగే జడ్పీటీసీ స్థానాలు 16, ఎంపీపీ స్థానాలు 16 ఉన్నాయి. వీటి కిగాను తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనుండగా, అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి జిల్లాకు ఇప్పటికే చేరింది. ఎంపీటీసీ ఎన్నికల కోసం గులాబీ, జడ్పీటీసీ పోలింగ్ కోసం తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేస్తున్నారు.

నామినేషన్ దాఖలులో నిబంధనలు...

ఇంతకు పూర్వం ఒక అభ్యర్థి అనేక పదవుల కోసం పోటీపడే అవకాశం ఉండేది. ఇప్పుడు ఒక అభ్యర్థి ఒక్క పదవికే పోటీ చేయాలనే నిబంధనను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీంతో ఒక అభ్యర్థి ఒకేసారి జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు పోటీచేసే అవకాశం ఈసారి ఉండే అవకాశాలు లేవు. రాష్ట్రంలో రిజర్వేషన్ల అంశం ఇంకా తేలకపోయినా, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరిలో రూపొం దించిన ఓటరు జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసి, తుది జాబితా ముసాయిదాను ఇటీవల విడుదల చేశారు. అయితే ఎన్నికల నాటికి కొత్తగా ఓటరు జాబి తాలో నమోదు చేసుకొనే అవకాశం కూడా యువతకు కల్పించారు.

అలాగే ఈసారి పంచాయతీ ఎన్నికల్లో నోటా విధానానికి ఈసీ శ్రీకారం చుడుతోంది. 2004 నుంచి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో అమలు చేస్తున్న నోటా ఇక మీదట స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అమలు చేయనున్నారు.

రేపటి నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విధుల బహిష్కరణ

దండేపల్లి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తామ సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సెప్టెంబర్ 1నుంచి నిరవధిక విధులను బహిష్కరిస్తున్నమని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు యాగండ్ల చంద్రగౌడ్, మహేందర్, సువర్ణ, పోని అన్నారు. దండేపల్లి మండలం లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌కు శనివారం పాఠశాలోని పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ద్వారా పాఠశాలలోని విధులు నిర్వర్తిస్తున్న తామకు 6 నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నమన్నారు. దీంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఎన్నిసార్లు తామ సమస్యపై ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకవచ్చిన పట్టించుకోవడం లేదన్నారు.

దీంతో తామ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 1 నుంచి నిరవధిక విధులను బహిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వం తమకు రావాల్సిన వేతనం చెల్లించి, సమస్యలు పరిష్కారించాలన్నారు.

మృతురాలు కుటుంబానికి అండగా కాంగ్రెస్ నేతలు

దండేపల్లి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన లశెట్టి సుజాత గత ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వారిది పేద కుటుంబం కావడంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మృతురాలు సుజాత కుటుంబాని పమర్శించి, రూ. 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో గూడెం మాజీ ఎంపిటిసి సభ్యులు తోట మోహన్, ముత్తె నారాయణ, నాయకులు చుంచు నగేష్, ఆకుల తిరుపతి, పెరం లచ్చన్న, లశెట్టి చంద్రయ్య ముత్తె శంకరయ్యలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తాండూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్ అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. మహేష్ రోడ్డు దాటుతుండగా బెల్లంపల్లి నుంచి తాండూర్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాల య్యాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా గాయాలైన మహేష్‌ను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్టీ రిజర్వేషన్ కోటా తొలగించి ముస్లింగా పరిగణించాలి

కాసిపేట, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదర్మారం గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ భుక్య సునిత అలియాస్ షేక్ సనాకు సంబంధించిన ఎస్టీ రిజర్వేషన్‌ను తొలగించి ముస్లింగా పరిగణించాలని కోరుతూ శనివారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ మాట్లాడుతూ మాజీ సర్పంచ్ భుక్య సునిత ముస్లింగా మతం మార్చుకొందన్నారు. కానీ ఎస్టీ కోటా కింద రిజర్వేషన్‌ను పొందు తుందన్నారు. అక్రమంగా ఎస్టీ కులధృవీకరణ పత్రం, ఓటు హక్కు కలిగి ఉందన్నారు. ఎస్టీ కోటా నుంచి తొలగించి ముస్లింగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

మండల ప్రెస్‌క్లబ్ ఎన్నిక

కన్నెపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెండే సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పొనగంటి స్వామి, ఉపాధ్యక్షులుగా నందిపేట శ్రీనివాస్, కోశాధికారిగా జిల్లెల్ల శ్రీకాంత్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా గట్టు ప్రసాద్‌గౌడ్, ప్రచార కార్యదర్శిగా ఆయిళ్ల వెంకటేష్, సలహదారునిగా మైదం రవీందర్, కార్యవర్గ సభ్యునిగా కుశన శ్రీనివాస్‌లను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు.

విగ్రహం ధ్వంసం

ఓదెల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొత్కపల్లి గ్రామంలోని పోచమ్మ గుడి వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పోతలింగన్న విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విగ్రహన్ని ధ్వంసం చేయడం వెనుక కులమతాలను రెచ్చగొట్టే కుట్ర ఉందని గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శనివారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర నాయకుడు బండి సదానందం మాట్లాడుతూ ఎంపీగా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. మంచిర్యాలలో వందేభారత్ నిలుపుదల కోసం ఆయన ఎంతో కృషి చేశారని, చివరకు రైలు ఆగేలా చూశారన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఎంపీ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, నరేష్ యాదవ్, రాజన్న, రాంరెడ్డి, సంజీవ్, రాజ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, సిద్దు పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవలో ముందుంటుంది

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంలో యూనివర్సల్ బ్యాంకు ముందుంటుందని బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్ తెలిపారు. శనివారం మంచిర్యాలలోని బ్యాంకు భవనంలో యూనివర్సల్ కో ఆపరేటివ్‌అర్బన్ బ్యాంక్ 48వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 88.13 లక్షల నికర లాభం వచ్చిందని తెలిపారు. దీంతో వాటాదారులకు 12 శాతం డివిడెంట్ ప్రకటిస్తున్నామన్నారు. త్వరలో గోదావరిఖని, భూపాలపల్లిలో బ్రాంచీలు ప్రారంభిస్తామన్నారు. డిపాజిట్లపై ఇతర బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో మూర్తి, బ్యాంకు వైస్ చైర్మన్ పూర్ణచం దర్‌రావు, డైరెక్టర్‌లు రావు, ప్రసాద్‌రావు, కృష్ణమూర్తి, శ్రీదేవి, రాజ లింగు, బక్కయ్య, బాను ప్రకాష్, రత్నం, సుశీల, భాగ్యలక్ష్మీ, ఆదిత్య పాల్గొన్నారు.

నిమజ్జనానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తాం



మున్సిపల్ కమిషనర్‌తో మమాట్లాడుతున్న ఏసీపీ

బెల్లంపల్లి, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటామని ఏసీపీ రవి కుమార్, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ అన్నారు. శనివారం వినాయకున్ని నిమజ్జనం చేసే పోచమ్మ చెరువును పరిశీలించారు. పట్టణంతో పాటు ఆయా మండలాల భక్తులు వినాయకున్ని నిమజ్జనానికి పోచమ్మ చెరువు వద్దకు తీసుకొస్తానని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ అనూక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జన స్థల ఏర్పాట్ల పరిశీలన

తాండూర్ : తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం జరిగే వినాయక నిమజ్జనం కోసం స్థానిక పెద్ద చెరువుతో పాటు రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్ బ్రిడ్జి ప్రదేశాలను శనివారం అధికారులు పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను ఉంచడంతో పాటు, పోలీసు బందోబస్తు పెద్ద ఎత్తున ఉంటుందన్నారు. నిమజ్జనానికి సంబంధించి ముందస్తు ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. మండపాల నిర్వహకులందరు సహకరించాలని, ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, సీఐ దేవయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, విద్యుత్ ఏఈ జాన్, ఎస్ఐ కిరణ్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు ఈసా, బానయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం..



నస్పూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నస్పూర్ టీఎన్‌జీవోస్ కాలనీలో సిద్ది వినాయక గణేష్ మండలి వద్ద ప్లాస్టిక్ రహిత పధార్థాలు వినియోగించాలని నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అందరినీ చైతన్య పరిచారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయితేనే ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయొచ్చని అభిప్రాయపడ్డారు.

సెప్టెంబరు 6న మంద కృష్ణమాదిగ రాక

తాండూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరు 6వ తేదీన తాండూర్ మండల కేంద్రానికి ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు రూ. 6 వేలు, వితంతువులు, ఒంటరి మహిళలకు, వివిధ పింఛన్ దారులకు రూ. 4 వేలు పింఛన్ పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు పెంచలేదన్నారు. పింఛన్‌దారులందరినీ ఏకం చేయడం కోసం మంద కృష్ణ మాదిగ తాండూర్‌కు వస్తున్నారని తెలిపారు. సభలో ఆయన ప్రసంగిస్తారని, నియోజకవర్గంలో అన్ని రకాల పింఛన్‌దారులు హాజరు కావాలని కోరారు.

ఈ సమావేశంలో నాయకులు జిలకర శంకర్, రత్నం ఐలయ్య, కృష్ణ మాదిగ, గణేష్ మాదిగ, శివ మాదిగ, అరుణ్‌మాదిగ, రాజ్ కుమార్ మాదిగ, రజాక్ ప్రభాకర్, సలీం, మల్లేష్, స్వామి, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

వందేభారత్‌కు మంచిర్యాలలో హాల్టింగ్

బెల్లంపల్లి, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్‌టూ నాగ్‌పూర్ రైలు నంబర్ 201012 0102 మార్గంలో నడుస్తున్న వందేభారత్ రైలును మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో త్వరలో హాల్టింగ్ ఇవ్వనున్నట్లు రైల్వే బోర్డు డైరెక్టర్ సంజయ్ తెలిపారు. వందేభారత్ రైలు ప్రారంభమైనప్పటి నుంచి రెండు జిల్లాల ప్రజలు హాల్టింగ్ ఇవ్వాలని కోరుతూ పలుసార్లు రైల్వేశాఖ అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యేలకు, ఎంపీలకు వినతిపత్రాలు అందజేశారు. వందేభారత్ రైలుకు హాల్టింగ్ కల్పించాలని కోరుతూ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ పార్లమెంట్‌లో లేవనెత్తారు. అలాగే బీజేపీ నాయకులు సైతం వందే భారత్ రైలు హాల్టింగ్ విషయంపై కేంద్ర పెద్దలకు విన్నవించుకున్నారు.

కాగజ్‌నగర్‌లోనూ..

కాగజ్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ మధ్య వెళ్లే వందేభారత్ రైలుకు కాగజ్‌నగర్‌లో హాల్టింగ్ ఇస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్టు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రితో పాటు రైల్వే జీఎంకు వినతి పత్రాలు అందించినట్టు పేర్కొన్నారు. దీంతో స్పందించి కాగజ్‌నగర్‌లో హాల్టింగ్ ఇచ్చినట్టు పేర్కొన్నారు.

మహాసభల పోస్టర్లు విడుదల

లక్షెట్టిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం యూఎస్ఎఫ్ఐ ప్రథ మ మహాసభల పోస్టర్లను ఆసంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చెవుటు మల్లేష్ మాట్లాడుతూ సెప్టెంబర్ 2,3 తేదీల్లో యుస్ఎఫ్ఐ ప్రథమ మహాసభలను లక్షెట్టిపేట పట్టణంలో నిర్వహిస్తున్నట్లు విద్యారంగ సమస్యల కోసం సంఘం ఎల్లవేళలా పోరాటం చేస్తుందన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

దండేపల్లి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మధ్యాహ్నభోజనం పథకం ప్రభుత్వం అమలు చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చెవుటు మల్లేష్ డిమాండ్ చేశారు. దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం వచ్చె నెల 2,3 తేదీలలో దండేపల్లిలో నిర్వహించే జిల్లా ప్రథమ మహాసభ సంబంధించిన ప్రచార పోస్టర్లు శనివారం విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

స్థానిక సమరానికి గ్రీన్‌సిగ్నల్



- స్థానికంలో 3.7 లక్షల పై చిలుకు ఓటర్లు...
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- ఓటరు తుది ముసాయిదా జాబితా విడుదల
- మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎలక్షన్లు..
- త్వరలో నోటిఫికేషన్ జారీకి ఈసీ సన్నాహాలు

మంచిర్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా సన్నద్ధమైంది. శనివారం సీఎం అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సంబంధిత అధికారులు ముమ్మర ఏర్పాట్లలో నిగమ్నమయ్యారు. రాష్ట్రంలో మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, ఆ తరువాత సర్పంచ్ ఎలక్షన్లు నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ త్వరలో షెడ్యూల్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. గ్రామ పంచాయతీల పాలన గత సంవత్సరం జనవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలక వర్గాల పదవీకాలం జూలైతో ముగిసింది. దీంతో స్థానిక సంస్థల పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఈసీ సిద్ధం కాగా ఎలక్షన్లకు సంబంధించి కీలక ఆ దేశాలు జారీ చేసింది. ఇప్పటికే పీవోలు, ఏపీవోలు, రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తికాగా, శిక్షణ తరగతులు కూడా ముగిశాయి.

306 పంచాయతీల పరిధిలో ఎన్నికలు..

స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లాలోని 306 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలో రెండు పం చాయతీ డివిజన్లలో 16 మండలాలు ఉన్నాయి. ఎంపీ టీసీ స్థానాలు 129 ఉన్నాయి. గతంలో 130 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు స్థానాలు విలీనం అయ్యాయి. కొత్తగా భీమిని, భీమారం మండలాల్లో..

మిగతా 7వ పేజీలో

జిల్లాలో ఓటర్ల సంఖ్య

పంచాయతీ ఎన్నికలకు గాను అధికారులు రూపొందించిన తుది ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని 306 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 3,76,669 ఓటర్లున్నారు. వీరిలో స్త్రీలు 1,91,011 మంది , పురుషులు 1,85,643, ఇతరులు 15 మంది ఓటర్లున్నారు. మండలాల వారీగా ఓటర్ల సంఖ్య ఇలా....

మండలం	ఓటర్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు
బెల్లంపల్లి	23,464	11,625	11,838	01
భీమిని	11,529	5844	5684	01
భీమారం	13,093	6394	6699	00
చెన్నూరు	26,475	13,040	13,435	00
దండేపల్లి	42,101	20,486	21,614	01
హాజీపూర్	16,954	8361	8593	00
జైపూర్	30,626	15,278	15,347	01
జన్నారం	44,412	21,670	22,740	02
కన్నెపల్లి	15,490	7,614	7,875	01
కాసిపేట	26,472	13,127	13,342	03
కోటపల్లి	26,990	13,320	13,668	02
లక్షెట్టిపేట	25,227	12,261	12,966	00
మందమర్రి	11,482	5678	5803	01
నెన్నెల	19,371	9636	9734	01
తాండూరు	27,757	13,741	14,016	00
వేమనపల్లి	15,226	7568	7657	01

ప్రజల రక్షణకు చర్యలు తీసుకోవాలి



మాతా శిశు ఆసుపత్రి వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా ఏర్పడుతున్నవరదల దృష్ట్యా ప్రజల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో గల గోదావరి నది తీరంలో మాతా శిశు ఆసు పత్రి, రామ్‌నగర్ ప్రాంతాల్లో వరద పరిస్థితిని డీసీపీ భాస్కర్, మున్సిపల్ కార్పో రేషన్ కమీషనర్ సంపత్‌లతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల వల్ల ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరిందన్నారు. నది తీర ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా అధికార యంత్రాంగం సమన్వయంతోరక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వరద నీటి కార ణంగా మొదట ప్రభావితమయ్యే మాతా శిశు ఆసుపత్రి నుంచి గర్భిణులు, బాలింతలు, పిల్లలను ఇతర ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందిస్తామన్నారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 27 కుటుంబాలను పునరావాస కేం ద్రాలకు తరలించి రక్షణ చర్యలు చేపట్టామన్నారు. ఏదై నా అత్యవసరం అయితే కంట్రోల్ రూమ్ 08736- 250 501లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, తహసీల్దార్ రఫతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం సమీకృత కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. రహదారులు మరమ్మత్తులు జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేసి పనులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌మనోజ్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఏసీపీలు ప్రకాష్, రవికుమార్, రవాణా అధికారి సంతోష్‌కుమార్, రోడ్లు భవనాలు, మున్సిపల్ కమిషనర్, పోలీసులు పాల్గొన్నారు.

మునిగిన పంటల పరిశీలన

జైపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కురిసిన భారీ వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వస్తున్నవరదల వల్ల సుమారు 9 వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదలడంతో మండలంలోని వేలాల, పౌనూరు, శివ్వారం గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. శనివారం తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపు రావులు మునిగిన పంటలను పరిశీలించారు. ప్రజలు ఎవరు కూడా నది వైపు వెళ్లవద్దని, చేపల వేటకు కూడా వెళ్లవద్దన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

లక్షెట్టిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని మస్తాన్‌గూడాలో వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈశిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వైద్యురాలు శ్రీజ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని పీహెచ్‌సీ వైద్య అధికారి సతీష్ ఆదేశాల మేరకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఎన్ఎం విజయ, సూపర్‌వైజర్ శోభారాణి, ఆశా కార్యకర్తలు శోభ, వసంత, లలిత ఉన్నారు.

వరద బాధితులకు రూ. 25 వేలు చెల్లించాలి



రామ్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వరదలతో నష్టపోయిన ప్రతీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 వేల నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్, రామ్‌నగర్‌లలో ఇళ్లలోకి చేరిన వరద నీటిని పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం వల్లనే నాలుగేళ్లుగా మంచిర్యాల పట్టణం బ్యాక్ వాటర్‌తో మునిగి ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ మంచిర్యాల ఎమ్మెల్యే కరకట్టల నిర్మాణం కోసం ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేసి ఇప్పటి వరకు పనులను ప్రారంభించలేదన్నారు. వరదలతో నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, కృష్ణమూర్తి, శ్రీదేవి, సతీష్‌రావు, శ్రీనివాస్, ప్రవీణ్, సత్యనారాయణ,జయరామారావు, రాజాబాబు, సతీష్, చిరంజీవి పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



దండేపల్లిలో సహకార సంఘం కార్యాలయం వద్ద యూరియా కోసం రైతుల క్యూ

దండేపల్లి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నెల్కి వెంకటాపూర్, గూడెం సహకార సంఘం కార్యాలయాల వద్ద యూరియా బస్తాల కోసం ఉదయం నుంచే వివిధ గ్రామాల రైతులు క్యూ కట్టారు. దండేపల్లి మండల కొంత మేరకు సొసైటీలో యూరియా స్టాక్ ఉండటంతో ఉన్న రైతులకు ఇచ్చారు. యూరియా అందని రైతులు మెనుదిరిగి వెళ్లిపోయారు. మండల వ్యవసాయ అధికారి గొర్ల అంజిత్ కుమార్, సొసైటీ సిబ్బంది, ఏఈవోల సమక్ష్యంలో రెండు ఎకరాలకు ఒక్క బస్తా చొప్పున రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు.

శోభాయాత్రకు ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హిందూ ఉత్సవ సమితి నాయకులు

నస్పూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల పూజలు ముగించుకొని నిమజ్జనం సందర్భంగా నిర్వహించే శోభాయాత్రకు అధికారులు ఏర్పాట్లు చేయాలని హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు చుంచు రాజ్ కిరణ్ కోరారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్, విద్యుత్, పోలీసు అధికారులు సమన్వయంతో గణపతి నిమజ్జన శోభాయాత్రకు ఏర్పాట్లు చేయాలని విన్నవించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గణపతి మండల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించకుండా బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలన్నారు. శోభాయాత్ర రోజున భక్తులకు ఇబ్బంది కలుగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రవీందర్, నవీన్, రాజేందర్, మహేందర్, తిరుపతి పాల్గొన్నారు.

అలరించిన జిల్లా స్థాయి కళోత్సవం



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలక్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం సైన్స్ కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవాల పోటీల్లో విద్యార్థుల నృత్యాలు ఎంతో అలరించాయి. ఆరు విభాగాల్లో నిర్వహించిన పోటీలకు జిల్లాలోని 350 మంది విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ముఖ్య అతిథిగా విద్యాధికారి యాదయ్య పాల్గొన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, చదువరి, డీఈవో శ్రీనివాస్, శాంఖరి, ఆర్‌కే ప్రసాద్, రాజన్న, సుమన పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌కు సన్మానం

జైపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కోటపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు పదవీ విరమణపొందిన సందర్భంగా శనివారం ఉపాధ్యాయులు, అధ్యాపకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి కాళేశ్వరం జోనల్ ఆఫీసర్ అరుణ కుమారి, డీసీవో నాగేశ్వర్‌రావులు హాజరై మాట్లాడారు. గత 35 ఏండ్లుగా గురుకుల విద్యాలయంలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి రమేష్‌బాబు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల గురుకుల ప్రిన్సిపల్ మోహన్, లక్షెట్టిపేట ప్రిన్సిపల్ రమాకళ్యాణిలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్



న్యాయవాదులు, పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న జడ్జి సాయికిరణ్

లక్షెట్టిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న నిర్వహించే లోక్ అదాలత్‌ను విజవంతం చేయాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కసమల అన్నారు. శనివారం పట్టణ న్యాయ స్థానంలో లోక్ అదాలత్‌పై అధికారులు న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయ సేవాధి కార సంస్థ కక్షి దారులకు కల్పించిన అవకాశంపై అవగాహన కల్పించి రాజీ కాదగిన కేసులన్నింటిని పరిష్కారం అయ్యే విధంగా ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షు డు కొమిరెడ్డి సత్తన్న, హాజీపూర్, దండేపల్లి జన్నారం, లక్షెట్టిపేట ఎస్సై లు స్వరూప్‌రాజ్, తహసీయోద్దీన్, స్వరూప్‌రాజ్, రామయ్య న్యాయవాదులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్లకార్డులతో విద్యార్థుల అవగాహన

మంచిర్యాలక్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం బెల్లం పల్లి చౌరస్తాలో మిమ్స్ విద్యార్థులు వినూతనంగా ప్లకార్డులతో సైబర్ నేరాలపై ప్రజలను అవగాహన కల్పించారు. శనివారం రద్దీ ప్రాంతాల్లో ప్రయాణీకులకు విద్యార్థులకు ప్లకార్డులు, బ్యానర్‌లతో నినాదాలు చేస్తూ దృశ్య రూపంలో సైబర్ నేరాలపై చక్కటి అవగాహన కల్పించారు. ఓటీపీ చెప్పడం వల్లనే సైబర్ నేరాలకు గురవుతున్నారని, ఫిషింగ్ లింక్‌లు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం అంశాలపై ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజు, శ్రీధర్‌రావు, వినయ్ కుమార్, ప్రిన్సిపాల్ శాంతాగౌడ్, వైస్ ప్రిన్సిపాల్ కరీష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై మిమ్స్ విద్యార్థుల ప్రదర్శన

గోదావరి ఉగ్రరూపం..

- ముంపునకు గురైన వేల ఎకరాల పంట
- పోటెత్తిన రాళ్లవాగు
- జిల్లా కేంద్రంలో నీట మునిగిన ఇళ్లు





ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు, ఎన్టీఆర్‌నగర్‌లో నీట మునిగిన ఇల్లు

మంచిర్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత రెండు రోజులుగా వర్షాలు పెద్దగా కురవకపోయినప్పటికీ దాని ప్రభావం మాత్రం విపరీతంగా ఉంది. శ్రీరాంసాగర్, కడెం రిజర్వాయర్ల నుంచి పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద తాకిడి పెరుగుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు గేట్లు తెరవడంతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. నది పరివాహక ప్రాంతాల్లో పంటలు, పలు ఇళ్లు ముంపునకు గురయ్యాయి. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 7 లక్షలపై చిలుకు క్యూ సె క్కుల నీరు వదులుతుండటంతో 37 గేట్లు తెరిచి 7,37, 881 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో ఉన్న గౌతమేశ్వరాలయం నీట మునిగింది.

వరద నీరు స్థానిక పుష్కరఘాట్‌ను పూర్తిగా ముంచెత్తింది. దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్, జైపూర్, చెన్నూరు మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. గోదావరిలో చేరే వీలు లేకపోవడంతో జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు ప్రమాదకర స్థితిలో పోటు కమ్మింది. నీరంతా రాంనగర్, ఎన్టీ ఆర్ కాలనీ, ఆదిత్య ఎన్‌క్లేవ్ సమీపం లోని ఇళ్లలోకి చేరింది. జిల్లా కేంద్రంలో రాళ్లవాగు బ్యాక్ వాటర్ కారణంగా సుమారు 40 ఇళ్లు ముంపుకు గురయ్యాయి. ప్రమాదాన్ని అంచనా వేసిన ముంపు కాలనీల ప్రజలు కొందరు ముందస్తుగా ఇళ్లను ఖాళీ చేసి, ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లగా, లోతట్టు ప్రాంతాల వరద బాధితులను అధికారులు స్థానిక భవన నిర్మాణ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి, సహాయక చర్యలు చేపడుతున్నారు. కాగా వరద ముంపుకు గురైన ప్రాం తాలను శనివారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎగ్గడి భాస్కర్, తహసీల్దార్ రఫతుల్లా, ఇతర రెవెన్యూ అధికారులు సందర్శించారు. కాగా జిల్లా కేంద్రంలోని ఆయా కాలనీల్లో గత మూడు రోజులుగా వరద నీరు నిలిచి ఉండటంతో ఆ ప్రాంతాలన్నీ తీవ్రమైన దుర్వాసన వెదజల్లు తున్నాయి. అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో క్లోరినేషన్ పనులు చేపట్టారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

మంచిర్యాల డీసీపీ భాస్కర్

లక్షెట్టిపేట, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుల విషయంలో అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గిడి భాస్కర్ అన్నారు. వా ర్షిక తనిఖీల్లో భాగంగా శనివారం లక్షెట్టిపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను శనివారం డీసీపీ తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్ రిసిప్షన్‌తో పాటు క్రైమ్ వాహనాలు పరిసరాలు పరిశీలించారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించిన డీసీపీ పోలీసు విధులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసులపై నమ్మకాన్ని కల్పించడంతోపాటు పోలీసుల పట్ల ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. ప్రతీ పోలీసు ఉద్యోగి మంచి నిబద్ధత, నిజాయితీతో పని చేయాలని పోలీసులకు వచ్చిన ఫిర్యాదులను మర్యాదపూర్వకంగా తీసుకోవాలన్నారు. పోలీసు వృత్తి క్రమ శిక్షణతో కూడిన వృత్తి అన్నారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ తమకు ఏలాంటి సమస్యలు ఉన్న చెప్పాలని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. స్టేషన్ తనిఖీకి వచ్చిన డీసీపీకి పట్టణ సీఐ రమణ మూర్తి, ఎస్సై గోపతి సురేష్ పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు. స్టేషన్ ఆవరణలో డీసీపీ మొక్కలను నాటి అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ వెంట మంచి ర్యాల ఏసీపీ ప్రకాష్ ఉన్నారు.



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్